క్లుప్తంగా

ఘనంగా సంకటహర చతుర్థి


ప్రత్యేక అలంకరణలో వరసిద్ధి వినాయకుడు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీ వరసిద్ధి వినాయక ఆలయంలో సంకటహర చతుర్థిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాగణపతికి పంచామృతాలు, గోక్షీరం, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేష అలంకరణ, మంత్రపుష్ప నీరాజనం, తీర్థ ప్రసాదాల వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో శాశ్వత చందాదారులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు అవర్లీ బేస్డ్ కింద కామర్స్ బోధించేందుకు అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డి.నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు ఎంకామ్‌తో పాటు బీఈడీ ఉండాలని, ఈ నెల 25వ తేదీ వరకు గడ్డిపల్లి మోడల్ స్కూల్‌లో సర్టిఫికేట్లతో దరఖాస్తు పత్రాలు అందజేయాలని ఆయన సూచించారు.

గ్రామ అభివృద్ధికి సహకారం అభినందనీయం


ముకుందాపురంలో సిమెంట్ బల్లాలను ప్రారంభిస్తున్న పందిరి నాగిరెడ్డి

మునగాల : గ్రామ అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని పందిరి ఫౌండేషన్ చైర్మన్ పందిరి నాగిరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని ముకుందాపురంలో ఇమ్మడి మోహన్‌రావు, లీలావతి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన రూ.15 వేల విలువైన సిమెంట్ బల్లాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పందిరి ఫౌండేషన్ కార్యదర్శి ఇమ్మడి సతీష్‌బాబు, గౌరవ సలహాదారు సేకు శ్రీనివాసరావు, సభ్యులు బారి వెంకన్న, మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, చిన్న నర్సయ్య, వెంకటరెడ్డి, తుమ్మల శ్రీను, తాళ్లపాక సైదులు, బాబు నాయక్, శనగని ఉపేందర్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై అవగాహన


మాట్లాడుతున్న ఎస్‌ఐ నరేష్

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సైబర్ నేరాలు, మత్తు పదార్థాలపై పోలీస్ కళాబృందం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్‌ఐ నరేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ మోసాల బారిన పడొద్దన్నారు. బ్యాంక్ ఖాతా, ఏటీఎం కార్డు, ఓటీపీ వివరాలు ఇతరులకు తెలపవద్దని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాన్ని నడపవద్దని, ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమించొద్దని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సురేందర్, ప్రధానోపాధ్యాయురాలు సువర్ణ, కానిస్టేబుల్ నాగేశ్వరరావు, హోంగార్డు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నాగిని

నేరేడుచర్ల : స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం నేరేడుచర్ల మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నాగిని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్, డాక్టర్‌లు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున ఎవరికైన జ్వరం వచ్చి తగ్గకుంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అలక సరిత, మున్సిపల్ కమిషనర్ యడవల్లి సైదిరెడ్డి, కౌన్సిలర్లు బాణోతు లలిత, అధికారులు, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆర్‌పీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఐలమ్మ యూనివర్సిటీగా నామకరణంపై హర్షం

హుజూర్‌నగర్ : హైదరాబాద్‌లోని కోఠిలో గల మహిళా యూనివర్సిటీకి ప్రభుత్వం చాకలి ఐలమ్మ యూనివర్సిటీగా నామకరణం చేయడం పట్ల పట్టణ రజక, లాండ్రీ వర్కర్స్ యూనియన్ నాయకులు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. యూనియన్ తరుపున ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

సమస్యల వలయంలో కాలనీలు


సిరిపురంలో రోడ్లు, డ్రెయినేజీ లేని డబుల్ బెడ్‌రూం ఇళ్ల కాలనీ


బుడిగ జంగాల కాలనీ ఇలా..

- 'డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీ, బుడిగ జంగాల కాలనీల్లో వసతులు కరువు
- ఇబ్బందులు పడుతున్న పేదలు
- పట్టించుకోని అధికారులు

నడిగూడెం : మండలంలోని సిరిపురం గ్రామంలో గల డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీ, బుడిగ జంగాల కాలనీల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. దీంతో ఆయా కాలనీల్లో నివసిస్తున్న పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయినా తమను పట్టించుకున్న నాథుడే లేరని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాది కిందట గత ప్రభుత్వం సిరిపురంలో 50 డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి పేద ప్రజలకు పంపిణీ చేసింది. కానీ ఆ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించడం మాత్రం మరిచింది. ముఖ్యంగా తాగు నీరు, రహదారులు, డ్రెయినేజీ వంటి వసతులు కల్పించలేదు. ఇక గత రెండు నెలలుగా ఈ కాలనీకి విద్యుత్ సరఫరా కావడం లేదు. దీంతో కాలనీవాసులకు సొంతిళ్లు వచ్చిన ఆనందం కూడా లేదని చెబుతున్నారు. తమ సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ కాలనీ వైపు చూడడం లేదని ఆరోపిస్తున్నారు.

32 ఏళ్లుగా గుడిసెల్లో బతుకుతూ..

బుడిగ జంగాల కాలనీలో 30 కుటుంబాలు గత 32 ఏళ్లుగా జీవనం కొనసాగిస్తున్నారు. పూరి గుడిసెల్లో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. కానీ ఈ కాలనీకి అధికారులు ఎలాంటి వసతులు కల్పించడం లేదు. గ్రామానికి ఆనుకొని ఉన్నప్పటికీ వెలివేసినట్లే అన్న చందంగా ఉంది వారి జీవనం. అయితే మూడున్నర ఏళ్ల కిందట వారి ఇళ్లను తొలగించి, అదే స్థలంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీ నిర్మించారు. దీంతో డబుల్ బెడ్ రూం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో వారు తిరిగి గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు. ఆ కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు ఇళ్ల మధ్యనే నిల్వ ఉంటోంది. దీంతో దోమలు, ఈగల వ్యాప్తితో అక్కడి పేద ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. వీధి దీపాల సౌకర్యం కూడా లేకపోవడంతో అంధకారంలోనే ఉంటున్నారు. కాలనీ చుట్టూ ముళ్ల పొదలుండడంతో నిత్యం విష పురుగులు సంచరిస్తున్నాయి. ఇటీవల ఓ చిన్నారిని పాము కాటు వేసింది. అక్కడ తాగు నీరు సౌకర్యం కూడా లేదు. సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులకు అనేక సార్లు విన్నవించినా స్పందన కరువైందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలో సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

అంధకారంలో ఉంటున్నాం



డబుల్ బెడ్‌రూం ఇళ్లలో గత ఏడాదిగా నివాసం ఉంటున్నాం. నాటి నుంచి నేటి వరకు కాలనీలో ఎలాంటి మౌలిక వసతులు కల్పించలేదు. డ్రెయినేజీ, నీటి వసతి లేదు. గత రెండు నెలలుగా విద్యుత్ సరఫరా లేక అంధకారంలోనే ఉంటున్నాం. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

– వెంకటయ్య, డబుల్ బెడ్‌రూం ఇళ్ల కాలనీ వాసి, సిరిపురం

ఇబ్బందులు పడుతున్నాం



మేం ఏళ్ల తరబడి గుడిసెల్లో నివాసం ఉంటున్నాం. మాల కాలనీలో డ్రెయినేజీ, రహదారులు, నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం. ఇళ్ల చుట్టూ ముళ్ల పొదల మధ్య జీవనం కొనసాగిస్తున్నాం. రాత్రి సమయంలో విష పురుగుల సంచారంలో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ఉంటున్నాం.

– నిదానం రాములు, బుడిగ జంగాల కాలనీ వాసి, సిరిపురం

ఆకట్టుకున్న విద్యార్థుల మాక్ పోలింగ్


ప్రెసిడెంట్‌గా ఎన్నికైన విద్యార్థికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల నిర్వాహకులు

మోతె : మండలంలోని మామిళ్లగూడెంలో గల శ్రీవెంకటేశ్వర పాఠశాలలో విద్యార్థులకు శనివారం కరస్పాండెంట్ జానిమియా ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ పోలింగ్ ఆకట్టుకుంది. ప్రెసిడెంట్ ఎన్నికకు ఇద్దరు విద్యార్థులు పోటీ పడగా బ్యాలెట్ పేపర్ పద్ధతిలో దాదాపు వేయి మంది విద్యార్థులు ఓటు వేశారు. ప్రజా సేవ పార్టీ అభ్యర్థి బత్తుల దిలీప్‌పై భారత సేనా పార్టీ అభ్యర్థి నక్షత్ర 470 ఓట్ల మెజార్టీతో గెలుపొందింది. దీంతో నక్షత్రతో ప్రెసిడెంట్‌గా ప్రమాణస్వీకారం చేయించి ధృవీకరణ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో రాజకీయ చైతన్యం కోసం ప్రతి ఏడాది మాక్ పోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కేలోతు శ్యాంప్రసాద్ వ్యవహరించారు. ఉపాధ్యాయులు ఎస్‌కే చాంద్‌పాషా, వేముల రమేష్, మల్లేష్‌గౌడ్, శారద, నవ్య, సరిత పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు ప్రాధాన్యం ఇవ్వాలి


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ యాకుబ్‌పాషా, హెచ్‌ఎం జయవాణి

హుజూర్‌నగర్ : పారిశుద్ధ్యం మెరుగుకు ప్రాధాన్యం ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ యాకూబ్ పాషా అన్నారు. స్వచ్ఛతా హీ సేవ– 2024లో భాగంగా శనివారం మున్సిపాలిటీలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పారిశుద్ధ్యం, స్వచ్ఛతపై అవగాహన కల్పించి వారిచే స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. 4, 21 వార్డుల్లో చెత్త తొలగింపజేశారు. హెచ్‌ఎం జయవాణి దేవి, శానిటరి ఇన్‌స్పెక్టర్ అశోక్, ఈఈ రాజశేఖర్, ఉపాధ్యాయులు, వార్డు అధికారులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు మైక్‌సెట్ అందజేత


ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌కు మైక్‌సెట్ అందజేస్తున్న సొసైటీ సభ్యులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఓపెన్ ఐస్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.7 వేల విలువ గల మైక్ సెట్‌ను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఓపెన్ ఐస్ సొసైటీ సభ్యులను ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామారావు, ప్రియదర్శిని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రవీందర్, సొసైటీ సభ్యులు ఎస్.చందు, కె.లక్ష్మణ్, వి.కృష్ణ, డి.రమేష్, పి.శ్రీకాంత్, అధ్యాపకులు ప్రియాంక, బాలరాజు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజం


నేరేడుచర్ల: బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ చత్రునాయక్, తోటి ఉపాధ్యాయులు

నేరేడుచర్ల : ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని ఎంఈఓ చత్రునాయక్ అన్నారు. మండలంలోని దిర్శించర్ల గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు కట్టా మాధవి, డి.వెంకటలక్ష్మిలను శనివారం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించి మాట్లాడారు. ఉద్యోగులు ఎక్కడ పనిచేసినా మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మామిళ్ల శ్రీనివాస్‌రెడ్డి, బట్టు మధు, ఇంజమూరి కాటయ్య, మండల నోడల్ అధికారి సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు చల్లా ప్రభాకర్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి, సైదులు, సంధ్య, స్వాతి, కిరణ్మయి ఉన్నారు.

సాయిఈశ్వరి సేవలు అభినందనీయం


మునగాల : ప్రిన్సిపాల్ సాయిఈశ్వరిని సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

మునగాల : పాఠశాల అభివృద్ధికి సాయిఈశ్వరి సేవలు అభినందనీయమని తహసీల్దార్ వి.ఆంజనేయులు అన్నారు. స్థానిక మోడల్ స్కూల్ నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన ప్రిన్సిపాల్ సాయి ఈశ్వరిని శనివారం ఆయన సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రమేష్ దీనదయాళ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లపాటి శ్రీనివాస్, శెట్టి గిరి, కొమ్ము ఈదారావు, కేఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ అర్వపల్లి శంకర్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఓరుగంటి రవి, బీఆర్‌ఎస్ నాయకులు కందిబండ సత్యనారాయణ, ఉడుం కృష్ణ, నల్లపాటి నాగరాజు, సీపీఐ నాయకులు చిల్లంచర్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక చేయూత

పెన్‌పహాడ్ : భర్త అనారోగ్యంతో మృతి చెందగా తమ చిన్ననాటి స్నేహితురాలికి పూర్వ విద్యార్థులు శనివారం ఆర్థిక సహకారం అందజేశారు. మండల పరిధిలోని అనంతారం గ్రామానికి చెందిన గుండు యాదమ్మ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–04 విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యనభ్యసించింది. తన భర్త మల్లేష్ అనారోగ్యానికి గురై కొన్ని రోజుల క్రితం మృతి చెందగా పూర్వ విద్యార్థులు యాదమ్మ పిల్లల సంక్షేమం కోసం రూ. 80వేల నగదును పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. తోటి స్నేహితురాలు ఇబ్బందుల్లో ఉండటాన్ని గమనించి ఆర్థిక సహకారం అందజేసిన పూర్వ విద్యార్థులను మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గరిడేపల్లి : మండలంలోని కట్టవారిగూడెం గ్రామ పరిధిలో గల గంగిరెడ్డుల కాలనీలో నిరుపేద కుటుంబానికి చెందిన జిడ్డు మారెమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. శనివారం మృతురాలి కుటుంబానికి గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రూ. 5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కీత వెంకటేశ్వర్లు, మాజీ ఉప సర్పంచ్ గందె ఉపేందర్ రావు, బాలూరి వెంకటయ్య, కీత వెంకటేశ్వర్లు, కీత శ్రీనివాసరావు, జిడ్డు నాగరాజు, మాదాసు నాగరాజు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ రికార్డుల తనిఖీ


మఠంపల్లి గ్రామపంచాయతీలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

మఠంపల్లి : ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా శనివారం మఠంపల్లి, బక్కమంతులగూడెంలో పారిశుద్ధ్య పనులను ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా మఠంపల్లి గ్రామ పంచాయతీ పంచాయతీ రికార్డులు తనిఖీ చేశారు. అక్కడ నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు విజయ, రాజు, జూనియర్ అసిస్టెంట్ మట్టయ్య, ఏఎన్‌ఎంలు, ఆశా వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రమేష్ మృతి పార్టీకి తీరని లోటు

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని తమ్మరకు చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు తమ్మినేని రమేష్ శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని సీపీఐ మండల కార్యదర్శి, కౌన్సిలర్ బత్తినేని హనుమంతరావు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. రమేష్ మృతి సీపీఐకి తీరని లోటని అన్నారు. నివాళులర్పించిన వారిలో పోతురాజు సత్యనారాయణ, కమతం పుల్లయ్య, బత్తినేని శ్రీనివాసరావు, కోటి నారాయణ, కొండా కోటేశ్వరరావు, రామకృష్ణ, మురళి, గోవిందరావు, దిబ్బయ్య తదితరులు ఉన్నారు.

గుర్వయ్యకు నాయకుల నివాళి

నడిగూడెం : మండలంలోని శ్రీరంగాపురం గ్రామ మాజీ ఉప సర్పంచ్, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బండారు గుర్వయ్య శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. శనివారం ఆయన మృతదేహాన్ని వివిధ పార్టీల నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింత బాబు, నాయకులు బాణాల అబ్రహం, కనుకు జానయ్య, స్వామి, నాగేశ్వరరావు, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి వేపూరి సుధీర్, మంగయ్య, ప్రవీణ్, విజయ్, శ్రీరామ్, తదితరులు ఉన్నారు.

'రైతు భరోసా' అమలు చేయాలి

నడిగూడెం : రైతు భరోసా పథకాన్ని ప్రభుత్వం తక్షణమే అమలు చేసి రైతులను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కన్నెబోయిన రామారావు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం రత్నవరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ పూర్తి కావస్తోందని, రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు.

డ్రెయినేజీ పనులు చేపట్టాలని వినతి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ సుబ్బారావు తదితరులు

కోదాడ : మున్సిపాలిటీ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్డులో 20 రోజుల క్రితం మున్సిపల్ అధికారులు డ్రెయినేజీ పూడికతీత పేరుతో ఏకంగా డ్రెయినేజీ గోడలతో సహా తీసి వేశారని, వెంటనే ఆ ప్రాంతంలో మున్సిపాలిటీ నిధులతో డ్రెయినేజీ తిరిగి నిర్మించాలని కోరుతూ ఆ ప్రాంతానికి చెందిన పలువురు శనివారం కోదాడ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణంలో ప్రధాన రహదారి వెంట పూడికతీత పనులు అస్తవ్యస్తంగా చేపట్టారని, కొన్ని చోట్ల డ్రెయినేజీ పగులగొట్టి అలాగే వదిలేయడంతో వ్యాపారస్తులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మున్సిపాలిటీలో సమస్యల పరిష్కారానికి పట్టణ పన్ను చెల్లింపుదారుల సంఘ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారావు, ముడియాల భరత్‌రెడ్డి, సజ్జా త్రివేది, మేళ్లచెరువు కోటేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, నాయకులు తిపిరిశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

దీపాదాస్ మున్షీని సన్మానించిన నాగన్నగౌడ్


దీపాదాస్ మున్షీని సన్మానిస్తున్న నాగన్న

హుజూర్‌నగర్ : కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ శనివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాల కార్మికుల సమస్యలు, పలు అంశాలను ఆమెకు వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్, వివిధ యూనియన్ల రాష్ట్ర నాయకులు ఈ.శ్రీధర్, బి.వెంకటేశ్వర్‌రెడ్డి, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా అభ్యంతరాలపై విచారణ జరపాలి

- హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు


గరిడేపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

నేరేడుచర్ల : ముసాయిదా ఓటరు జాబితాపై వచ్చే అభ్యంతరాలపై కార్యదర్శులు క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. ఓటరు జాబితాపై వచ్చే అభ్యంతరాలపై శనివారం నేరేడుచర్ల మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సురగి సైదులు, ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి, ఎంపీఓ హరిసింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

తప్పులు సరిచేసి ఆన్‌లైన్ చేయాలి

గరిడేపల్లి : గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో అభ్యంతరాలపై విచారణ జరిపి తప్పులు సరిచేసి ఈనెల 26వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. శనివారం గరిడేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితాలో అభ్యంతరాలపై పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజ, తహసీల్దార్ కవిత, ఎంపీఓ మౌలానా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు సవరించాలి


హుజూర్‌నగర్ : చింతలపాలెం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని దొండపాడు, గుడిమల్కాపురం, పీక్లానాయక్‌తండాల్లో ఓటర్ల జాబితాలు తప్పుల తడకగా ఉన్నాయని, జాబితాల్లో తప్పులు సవరించాలని ఆయా గ్రామస్తులు శనివారం తహసీల్దార్ సురేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెళ్లి చేసుకుని అత్తవారింటికి వెళ్లిన వారు, పదేళ్ల క్రితం చనిపోయిన వారు, ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న వారి పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయని తెలిపారు. తప్పులు సవరించి సక్రమంగా ఓటరు జాబితా తయారు చేయాలని కోరారు. కార్యక్రమంలో దొండపాడు నాయకులు పి.శ్రీనివాసరావు, ఎన్.సత్యం, తోట శేషు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరించాలని వినతి

నడిగూడెం : మండలంలోని కాగితరామచంద్రాపురంలో గ్రామ పంచాయతీ ఓటరు జాబితాలో సవరణ చేయాలంటూ అఖిల పక్షం ఆధ్వర్యంలో శనివారం పంచాయతీ కార్యదర్శి మల్లారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లను ఒకే వార్డులో చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో గార్లపాటి శ్రీనివాసరెడ్డి, నీలకంఠం వెంకటేశ్వర్లు, ఎస్‌కె.జహీర్, తదితరులు పాల్గొన్నారు.

226 దరఖాస్తులు

గరిడేపల్లి : మండలంలోని 32 గ్రామ పంచాయతీల నుంచి ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలు తెలుపుతూ తప్పులు సవరించాలని 226 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ సరోజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పొనుగోడు గ్రామం నుంచి అత్యధికంగా 63 దరఖాస్తులు వచ్చినట్లు ఆమె పేర్కొన్నారు.

పౌష్టికాహారంతోనే చిన్నారుల ఎదుగుదల


హుజూర్‌నగర్ : చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మండల వైద్యాధికారి పుష్పలత

హుజూర్‌నగర్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తేనే వారిలో ఎదుగుదల ఉంటుందని మండల వైద్యాధికారి పుష్పలత అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని 15వ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల వయసుకు తగ్గ బరువు, ఎత్తు ఉన్నారా లేదా అని పరిశీలించి మాట్లాడారు. తల్లిపాలతో పాటు వయస్సును బట్టి ఆహారం అందించాలన్నారు. కార్యక్రమంలో గోవిందపురం, హుజూర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, వైద్య సిబ్బంది నూర్జహాన్ బేగం, ఇందిరాల రామకృష్ణ, సావిత్రి, ఆశా కార్యకర్తలు, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

రామలక్ష్మీపురంలో పోషణ్ అభియాన్

కోదాడరూరల్ : మండలంలోని రామలక్ష్మీపురంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరిత మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్వరాజ్యం, విమల, అరుణ, జ్యోతి తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న స్కూల్ గేమ్స్


వాలీబాల్ క్రీడలో తలపడుతున్న క్రీడాకారులు

చిలుకూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ రెండు రోజులుగా కొనసాగుతున్నాయి. శనివారం అండర్– 14, అండర్– 17 విభాగాల్లో బాల బాలికలకు కబడ్డీ, ఖో– ఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి, క్రీడల ఇన్‌చార్జ్, పీడీ సీతారాంరెడ్డి, పీడీలు బ్రహ్మారెడ్డి, రేణుక, ప్రకాశ్, శోభన్‌బాబు, మట్టయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టౌన్ లెవల్ ఫెడరేషన్ సభ్యులపై చర్యలు తీసుకోవాలి

సూర్యాపేట : టౌన్ లెవెల్ ఫెడరేషన్ అధ్యక్షురాలు వెన్న కవిత, సంఘం సభ్యురాళ్లు ప్రియదర్శిని, భాగ్యమ్మలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని రిసోర్స్ పర్సన్ జిల్లా అధ్యక్షురాలు అన్నెపర్తి రాణి డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట శనివారం రిసోర్స్ పర్సన్స్(ఆర్పీలు) సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తీసుకున్న పొదుపు సంఘం డబ్బుల నిమిత్తం రికవరీకి వెళ్తే పదేళ్లుగా లెక్కలు చూపించకుండా లేనిపోని నిందలు మోపి తమను తొలగించాలని జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టౌన్ లెవెల్ ఫెడరేషన్ అధ్యక్షురాలు ప్రతి మూడు సంవత్సరాలకు ఒక్కసారి మారాల్సి ఉండగా ఒక్కరే పది సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారని వాపోయారు. తమపై అసత్య ఆరోపణలు చేస్తున్న వారిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆర్పీలు కోతి పద్మ, కోల మంగ, బీబీ, పద్మ, విజయమ్మ ఉన్నారు.